సాక్షి
ప్రకాశం
బుధవారం । 2 । ఏప్రిల్ । 2025



కూలి అందక..పూట గడవక

జిల్లాలో ఉపాధి హామీ పథకం కూలీలకు రెండున్నర నెలలుగా వేతనాలు అందలేదు. చేసిన పనికి ప్రతిఫలం అందక కూలీలు ఇతర పనులకు వెళ్తున్నారు.

- 8లో..



ఒకే రాత్రి ఐదు ఆలయాల్లో చోరీ

దర్శి మండలంలో ఒకే రోజు రాత్రి ఐదు ఆలయాల్లో చోరీలు జరిగాయి. బంగారం, వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
36/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు ఫ్యాప్టో నిరసన జయప్రదం చేయండి

ఒంగోలు సిటీ: రాష్ట్ర ఫ్యాప్టో సంఘం పిలుపు మేరకు బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్ వద్ద జిల్లా ఫ్యాప్టో శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమంలో వందలాది సంఖ్యలో జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్స్ పాల్గొని విజయవంతం చేయాలని ఫ్యాప్టో, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె.వి.జి.కీర్తి, వై.శ్రీనివాసులు, పి.వి.సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన పీఆర్సీ, ఐఆర్, డీఏ,"సంరెండర్ లీవ్స్, సీపీఎస్ ఉపాధ్యాయుల అరియర్స్ వంటి మొండి బకాయిల సాధన, విద్యారంగ సమస్యల సాధన కోసం నిరసన తెలుపుతున్నామని జిల్లా ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటరావు, ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అశోక్ కుమార్ తెలిపారు.

ప్రధాన డిమాండ్‌లు ఇవీ..

- సీపీఎస్, జీపీఎస్ లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి.
- 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ద్వారా పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేయాలి.
- 12 వ పీఆర్సీకి కమిషన్ ను వెంటనే నియమించాలి. ఈ లోగా 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలి. 3 డీఏలను ప్రకటించాలి.
- 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు, సరెండర్ లీవు బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ను తక్షణమే చెల్లించాలి.
- 70 ఏళ్లు దాటిన పెన్షనర్స్‌కు 10 శాతం, 75 ఏళ్లు నిండిన వారికి 15 శాతం అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ ను అమలు చేయాలి
- పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను తక్షణమే చేపట్టాలి. కలెక్టర్ పూల్ ద్వారా వెంటనే పోస్టింగ్స్ ఇవ్వాలి.
- ప్రభుత్వ, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ కు సంబంధించి 72, 73, 74 జి.ఓ లను అమలు చేయాలి.

రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు భూమిపూజ నేడు



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అధికారులు

పీసీపల్లి: మండల పరిధిలోని దివాకరపల్లె గ్రామం వద్ద ఏర్పాటు చేయనున్న రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు బుధవారం భూమిపూజ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, రిలయన్స్ ప్రతినిధిగా అనంత్ అంబానీ తదితరులు వస్తున్న నేపథ్యంలో అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, జేసీ ఆర్ గోపాలకృష్ణలతో కలిసి సభా వేదిక వద్ద జిల్లా అధికారులతో సమావేశమై ముందస్తు ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి వస్తున్న వీవీఐపీలకు, వీఐపీలకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తో పాటు ఎస్పీ దామోదర్, ఆర్డీఓ కేశవర్ధన్ రెడ్డి, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు లక్ష్మీ నారాయణ, నాగరాజు, సాయి ఈశ్వర్ యశ్వంత్, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై వాస్తవాలు బయటపెట్టండి



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

ఒంగోలు టౌన్: పాస్టర్ అనుమానాస్పద మృతిపై నిస్పక్షపాతంగా విచారణ జరిపించాలని, వాస్తవాలను బయట పెట్టాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఫ్లై ఓవర్ నుంచి ట్రంకు రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మృతిపై వాస్తవాలను వెలికి తీసి దోషులను కఠినంగా శిక్షించినప్పుడే ఇలాంటి దుర్మార్గాలు పునరావృతం కాకుండా ఉంటాయని చెప్పారు. పాస్టర్ మృతిపై రిటైర్డ్ జడ్జితో విచారణ జరపాలని, పాస్టర్ ప్రవీణ్ కుటుంబాన్ని ఆదుకోవాలని, దళిత క్రిస్టియన్ల మీద దాడులు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మైనారిటీ క్రైస్తవ మతాల ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మతోన్మాదులు పెట్రేగి పోతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పాస్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సర్వజన వైద్యం ఐసీయూలో..

పేరుకే పెద్దాసుపత్రి.. జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది రోగులు ఇక్కడకు వచ్చి వెళ్తుంటారు.. ఎప్పుడు చూసినా రద్దీగా ఉంటుంది. రోడ్డు ప్రమాదాలు, పాయిజన్ కేసులు, ఎంఎల్‌సీ వంటి అత్యవసర కేసులు సైతం పెద్ద ఎత్తున వస్తుంటాయి. ఇక్కడ స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత వేధిస్తోంది. చిన్న చిన్న కేసులు తప్పించి మిగతా కేసులను గుంటూరుకు తరలించి చేతులు దులుపుకుంటున్నారు. అత్యవసర వైద్య విభాగం ఎక్కడో కనిపించదు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అత్యవసర వైద్యం ఐసీయూ మంచమెక్కింది.



ఒంగోలు జీజీహెచ్



- స్పెషలిస్టు వైద్యం అందని ద్రాక్షే
- న్యూరాలజిస్టు, గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు, డయాబెటాలజిస్టులు లేరు
- న్యూరాలజిస్టు లేకుండానే సదరం సర్టిఫికెట్లు మంజూరు
- ఒక్క కార్డియాలజిస్టుతోనే సర్దుకొనిపోతున్న వైనం
- కనిపించని ట్రామా కేర్ విభాగం
- ఏదైనా సమస్య వస్తే గుంటూరుకు రెఫర్
- స్పెషలిస్టు వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రులే దిక్కు

ఒంగోలు టౌన్: రిమ్స్.. వేలాది మంది రోగులకు వైద్య సేవలు అందించే జిల్లా ఆసుపత్రి. వందలాది మంది వైద్య విద్యార్థులను తీర్చిదిద్దే బోధనాసుపత్రి. అయినా ఇక్కడ సూపర్ స్పెషాలిటీ సేవలు అందని ద్రాక్షగా మిగిలిపోతున్నాయి. న్యూరాలజిస్టు లేకుండానే సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. ఒక్కరే కార్డియాలజిస్టు ఉండడంతో ఆయన సెలవు పెడితే వైద్య సేవలు ఆగిపోతున్నాయి. లేజర్ చికిత్స లేక కిడ్నీ రోగులు పాట్లు పడుతున్నారు. ఒంగోలు దక్షిణ, ఉత్తర బైపాస్ ల మీద తరచుగా ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇక్కడ ట్రామా సెంటర్ కనిపించదు.. ఇలా చెప్పుకుంటూ పోతే చాంతాడంత సమస్యలతో జీజీహెచ్ సతమతమవుతోంది. పేరుకు అనేక మంది వైద్యులున్నప్పటికీ వైద్య సేవల విషయంలో పాలకుల కొండంత నిర్లక్ష్యం కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని విమర్శలు వస్తున్నాయి. వైద్య సేవల కంటే రాజకీయాలకే ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో రోగుల పరిస్థితి దయనీయంగా ఉంది. ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి వందల రుపాయల ఓపీ ఫీజులు, వేల రూపాయల రక్త పరీక్షల చేయించే స్థోమత లేని వాళ్లే ఇక్కడకు వైద్య చికిత్స కోసం వస్తుంటారు. ఎంతో ఆశతో ఆస్పత్రికి వచ్చిన రోగులు వైద్యుల నిర్లక్ష్యంతో అవస్థలు పడుతున్నారు. గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని వాపోతున్నారు.

న్యూరాలజిస్టు లేకుండానే సదరం సర్టిఫికెట్లు...

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సదరంకు వచ్చే వికలాంగుల ఆరోగ్య పరిస్థితిని న్యూరాలజిస్టులు నిర్ధారించాల్సి ఉంటుంది. న్యూరాలజిస్టు లేకుండానే సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. కాదు కూడదంటే గుంటూరుకు వెళ్లండి. నెల్లూరుకు వెళ్లండని సలహా ఇస్తున్నారు. ఆ మధ్య కందుకూరు నుంచి ఒక రిటైర్డ్ ఉపాధ్యాయుడు అనారోగ్యంతో మాట కోల్పోయారు. ఆయన ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే సదరం సర్టిఫికెట్ జారీ చేశారు. కానీ అధికారులు ఆ సర్టిఫికెట్ చెల్లదని తిరస్కరించారు. న్యూరాలజిస్టు మాత్రమే సర్టిఫికెట్ ఇవ్వాలని చెప్పారు. దాంతో వారు అవస్థలు పడుతూ గుంటూరు వెళ్లి సదరం సర్టిఫికెట్ తీసుకోవాల్సి వచ్చింది. ఇలాంటి ఘటనలు నిత్యం రిమ్స్‌లో దర్శనమిస్తూనే ఉంటాయి. నిరుపేదలు చాలా ఇబ్బందులు పడుతున్నా ఇక్కడ పాలకులకు చీమకుట్టినట్టయినా లేదు. అంతే కాకుండా ఇటీవల పక్షవాతం కేసులు ఎక్కువై పోయాయి. చికిత్స కోసం జీజీహెచ్‌కు వస్తే గుంటూరుకు పంపిస్తున్నారు. నిజానికి పక్షవాతం కేసుల్లో తొలి గంటలోపు చికిత్స చేయాల్సి ఉంటుంది. దాన్ని గోల్డెన్ అవర్ అంటారు. ఇక్కడ నుంచి గుంటూరు వెళ్లాలంటే కనీసం రెండున్నర గంటల సమయం పడుతుంది. దాంతో గోల్డెన్ అవర్ సమయం దాటిపోతుంది. ఆ తరువాత ఎంత చికిత్స చేసినా ఫలితం పెద్దగా ఉండదు. దీంతో రోగులు అప్పో సప్పో చేసి ప్రైవేటు వైద్యశాలలకు వెళుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఇద్దరు న్యూరో సర్జన్లు ఉన్నారు. కానీ కనీసం న్యూరో ఫిజీషియన్ లేరు. అనేక సంవత్సరాల నుంచి ఈ ఆస్పత్రిలో న్యూరో ఫిజీషియన్ పోస్టు ఖాళీగా ఉంది. కొన్నాళ్ల క్రితం ఒక న్యూరాలజిస్టును నియమించారు. ఆయన ఇక్కడ ఉండలేక సెలవు మీద వెళ్లిపోయారు. ఆ తరువాత ఆయన బదిలీ చేయించుకున్నట్లు తెలిసింది. ఆ తరువాత మరో న్యూరాలజిస్టును ప్రభుత్వం ఇక్కడ వేయలేదు. అలాగే గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు, డయాబెటాలజిస్టులు సైతం ఇక్కడ లేరు.

ఒక్క కార్డియాలజిస్టుతోనే సరి...

పెద్దాసుపత్రిలో ఒక కార్డియాలజిస్టు మాత్రమే ఉన్నారు. ఆయన జిల్లా స్టెమీ నోడల్ ఆఫీసర్‌గా కూడా చేస్తున్నారు. ఒక్కరే కార్డియాలజిస్టు ఉండడంతో పనిభారంతో అల్లాడిపోతున్నారు. ప్రతి రోజు కనీసం 50 మంది రోగులు గుండె సమస్యలతో ఆస్పత్రికి వస్తుంటారు. వారిలో రోజుకు 4 నుంచి 5 మంది ఆస్పత్రిలో అడ్మిట్ అవుతున్నారు. ఇటీవల ఆయన వ్యక్తిగత పనుల మీద వారం రోజులు సెలవు మీద వెళితే రోగులను గుంటూరు రెఫర్ చేశారు. సాధారణ కేసులైతే పర్వాలేదు. అత్యవసర కేసుల విషయంలో మాత్రం రోగులు ఎక్కడకు వెళ్లాలి. అనివార్యంగా ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీయాల్సి వస్తోందని వాపోతున్నారు.

లేజర్ చికిత్స లేక కిడ్నీ రోగుల పాట్లు...



వేసవి కాలం వచ్చిందంటే చాలు కిడ్నీలో రాళ్ల సమస్య వేధిస్తోంది. ప్రస్తుతానికి ఇద్దరు యూరాలజిస్టులు ఉన్నా కిడ్నీలో రాళ్లకు చికిత్స చేసేందుకు తగిన వైద్య పరికరాలు లేకపోవడంతో వైద్యసేవలు అంతంత మాత్రంగానే ఉంది. కిడ్నీలో రాళ్ల కు చికిత్స చేయించుకునేందుకు వచ్చిన రోగులను గుంటూరుకు రిఫర్ చేసి మిన్నకుండి పోతున్నారు. దీంతో నిరుపేద సామాన్య రోగులు ఇబ్బందులు వర్ణనాతీతం. కిడ్నీలో రాళ్లకు సాధారణంగా లేజర్ ద్వారా చికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కానీ ఇంత పెద్ద ఆస్పత్రిలో లేజర్ వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని రోగులు వాపోతున్నారు. కిడ్నీలో రాళ్ల కేసులే కాకుండా గుండె జబ్బులు, షుగర్, రక్తపోటు రోగుల్లో కిడ్నీలు దెబ్బ తినే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యుల చెబుతున్నారు. జిల్లాలో కనిగిరి, మార్కాపురం తదితర ప్రాంతాల్లో కిడ్నీ కేసులు ఎక్కువగా ఉన్నాయి. ఇటీవల గుండె జబ్బులు కూడా ఎక్కువైపోయాయి. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో లేజర్ వైద్య పరికరాలను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది.

ట్రామా విభాగం ఎక్కడ ?

ప్రభుత్వాస్పత్రిలో ట్రామా కేర్ విభాగం ఎక్కడుందో వెతుక్కోవాల్సి వస్తోంది. ఒంగోలు దక్షిణ, ఉత్తర బైపాస్ ల మీద తరచుగా ప్రమాదాలు జరుగుతుంటాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కారు యాక్సిడెంట్లు నిత్యం జరుగుతుంటాయి. రోడ్డు ప్రమాదం జరిగిన వాళ్లను జీజీహెచ్‌కు తరలిస్తుంటారు. ఇక్కడ ప్రత్యేక ట్రామా విభాగం లేదు. నిజానికి ట్రామా విభాగంలో ఆరుగురు వైద్యులు, స్టాఫ్ నర్సులు 12 మంది, ఎంఎన్‌ఓలు 6, ఎఫ్ఎన్‌ఓలు 6, ఎల్‌టీ 3, రేడియాలజిస్టు 2, బయోమెడికల్ ఇంజినీరింగ్ ఒకరు ఉండాలి. ఈ సిబ్బంది ఎక్కడా కనిపించరు. ట్రామా కేర్ రోస్టర్ ఏమిటో తెలియదు. ట్రామా కేర్ కు ఏడాదికి ఎంత బడ్జెట్ వస్తుందో, అది ఏమైపోతుందో దేవుడికే తెలియాలి. యాక్సిడెంట్ కేసులను కూడా క్యాజువాలిటీ వైద్యంతోనే సరిపెడుతున్నారు. దాంతో రోగుల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. క్యాజువాలిటీలో సీనియర్ వైద్యులు ఒక్కరు కూడా సరిగా విధులు నిర్వహించడంలేదని విమర్శలు వస్తున్నాయి. మెడికోలు, జూనియర్ వైద్యులతోనే పనికానిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ అందుతున్న వైద్య సేవలపై సాక్షాత్తు కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరికలు జారీ చేసినా ఖాతరు చేయడం లేదనే చెప్పాలి.

కూటమి బండారాన్ని బయట పెడతాం

- ఆళ్ల ఆంజనేయ రెడ్డి అక్రమ అరెస్టు మీద న్యాయపోరాటం చేస్తాం
- టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్ బాబు జోక్యంతోనే తప్పుడు కేసులు
- ఎంపీపీ ఎన్నికల కోసం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, పక్కన త్రిపురాంతకం ఎంపీపీ ఆళ్ల సుబ్బమ్మ తదితరులు

ఒంగోలు టౌన్: త్రిపురాంతకం మండల పరిషత్ ఎన్నికల విషయంలో కూటమి నాయకులు చేసిన అక్రమాలు, అరాచకాలను బయట పెడతామని యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ చెప్పారు. జిల్లా జైలులో ఉన్న ఎంపీటీసీ ఆళ్ల ఆంజనేయరెడ్డిని మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం తాటిపర్తి మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఎంపీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆంజనేయ రెడ్డి మీద అక్రమ కేసులు పెట్టి జైలుపాలు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని మండిపడ్డారు. జరగని దాడిని జరిగినట్లు చిత్రీకరించి, అధికార పార్టీ ఒత్తిళ్లతో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దానికి అనుగుణంగా సాక్షులను తయారు చేసి పక్కా ప్రణాళిక ప్రకారం ఆళ్ల మీద తప్పుడు కేసులు పెట్టారని వివరించారు. అధికార పార్టీ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు సూచనలు, సలహాలతోనే పోలీసులు కేసు పెట్టారని ఆరోపించారు. త్రిపురాంతకం ఎన్నికల్లో టీడీపీ గెలిచి ఉంటే బలం పెరిగిందని చెప్పుకునేవారని, ఇప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారమని తప్పుకుంటున్నారని విమర్శించారు. త్రిపురాంతకం ఎన్నికలు వైఎస్సార్ సీపీ అంతర్గత వ్యవహారమైతే మా పార్టీ ఎంపీటీసీ సృజనను టీడీపీ ఇన్‌చార్జ్ పర్యవేక్షణలో మార్కాపురంలో ఎందుకు గృహనిర్బంధంలో ఉంచారని ప్రశ్నించారు. పోలీసులకు ఫోన్లు చేసి ఎందుకు కేసులు పెట్టించారో చెప్పాలని నిలదీశారు. యర్రగొండపాలెంలో ఒక దుకాణంలో దళితుడి మీద దాడి చేసి తల పగులగొడితే పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయలేదన్నారు. ఎలాంటి సాక్ష్యాలు లేకపోయినా ఆళ్ల ఆంజనేయ రెడ్డి మీద కేసు నమోదు చేశారని మండి పడ్డారు. ఎవరైతే కేసు పెట్టారని పోలీసులు చెబుతున్నారో వారే స్వయంగా తామెలాంటి కేసు పెట్టలేదని చెబుతున్నారని, తమ చేత బలవంతంగా సంతకాలు చేయించుకున్నారని సృజన తండ్రి దాసు చెబుతున్నారని తెలిపారు. దాసు కుటుంబ సభ్యుల చేత తప్పుడు వాంగ్మూలం ఇప్పించారని ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లతోనే పోలీసులు కేసు పెట్టారని, త్రిపురాంతకం సీఐ కంకణాలపల్లి ఎంపీటీసీకి ఫోన్ చేసి బెదిరించారని, ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాజకీయ ఒత్తిళ్లతో అమాయకుల మీద కేసులు పెట్టి వేధించడం సరికాదన్నారు. తాము ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినందు వల్లనే సీసీ కెమెరాల నిఘా మధ్యలో ఎన్నికలు నిర్వహించారని, లేకపోతే లోపల ఏం జరిగిందో ప్రపంచానికి తెలియకపోయేదన్నారు. ఆళ్ల ఆంజనేయ రెడ్డి మీద తప్పుడు కేసులు పెట్టిన వారి మీద చట్టపరంగా చర్యలు తీసుకునేలా న్యాయపోరాటం చేస్తామన్నారు. కూటమి దిగజారుడు రాజకీయాలు చేసిందని, కాకమ్మ కబుర్లు చెప్పి తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామన్నారు. ఎంపీటీసీ తండ్రి, ఆళ్ల ఆంజనేయ రెడ్డి మీద కేసు పెట్టినట్లు చెబుతున్న దాసు మాట్లాడుతూ...ఆంజనేయరెడ్డి ఎలాంటి దూషణలు చేయడం కానీ, ఆటకాయించడం కాని, దాడి చేయడం కానీ చేయలేదని చెప్పారు. ఆయన మీద ఎలాంటి కేసు పెట్టలేదని స్పష్టం చేశారు. పోలీసులు కావాలని తప్పుడు కేసు నమోదు చేశారని చెప్పారు. ఎమ్మెల్యే వెంట త్రిపురాంతకం ఎంపీపీ ఆళ్ల సుబ్బమ్మ, ఎంపీటీసీ మిరియంపల్లి సుబ్బారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జ్వాలాముఖికి రూ.25 లక్షలతో అలంకరణ

ఒంగోలుమెట్రో: మండంలోని పెళ్లూరు గ్రామంలో ఉన్న జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానంలో చైత్ర వసంత నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం అమ్మవారిని సుమారు రూ.25 లక్షల కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చక స్వాములు రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.200, రూ.500 నోట్లతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారిని స్థానిక భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించారు.



రూ.25 లక్షల నగదు అలంకరణలో జ్వాలాముఖి అమ్మవారు

పదింతల ఆనందం



హాస్టల్‌కు బైబై..



ఒంగోలు సిటీ: మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారం జరిగిన సోషల్ స్టడీస్ పరీక్షతో ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 29,486 మందికి గాను 28,980 మంది హాజరయ్యారు. 506 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు నిర్వహించడానికి జిల్లాలో 183 సెంటర్లను కేటాయించారు. డీఈఓ కిరణ్‌కుమార్ 5 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. 68 ఫ్లైయింగ్ స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సంతోషంగా కేరింతలు కొట్టారు. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు స్వగ్రామాలకు పయనమయ్యారు.



ఇక ఆటవిడుపు..విద్యార్థుల కేరింతలు



సెల్ఫీటైం..జ్ఞాపకాలు పదిలంగా..

క్లుప్తంగా

ఉపాధి హామీతో 2.95 లక్షల కుటుంబాలకు మేలు

ఒంగోలు సబర్బన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 2.95 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరిందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో 6 లక్షల మంది వేతనదారులకు పనులు కల్పించి వేతనాలు రూపంలో రూ.272.00 కోట్లు చెల్లించారన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 1.35 కోట్ల పనిదినాలు కల్పించటం లక్ష్యంగా ముందుకు సాగామన్నారు. ఇప్పటి వరకు 1.29 కోట్ల పనిదినాలు (96%) కల్పించామని, 4 లక్షల 42 వేల కుటుంబాలకు జాబ్ కార్డులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో మౌలిక వసతులైన పశువుల షెడ్స్, సిమెంట్ రోడ్స్, తారు రోడ్లు (బీటీ రోడ్లు), సుస్థిర వసతులు గ్రామీణ ప్రజలుకు రైతుల పొలంలో పంట సంజీవనీలు (ఫామ్ పాండ్స్) నిర్మించినట్లు వివరించారు.

మిస్సింగ్ కేసు నమోదు


లేళ్లపల్లి కొండమ్మ (ఫైల్)

పొన్నలూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం మిస్సింగ్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన లేళ్లపల్లి కొండమ్మ మార్చి 29న శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే నాలుగు రోజులైనా ఇంటికి రాకపోవడంతో బంధువులను, చుట్టపక్కల గ్రామాల్లో విచారించిన కుటుంబ సభ్యులు కొండమ్మ ఆచూకీ తెలియకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనూక్ తెలిపారు.

పామూరులో..

పామూరు: పామూరుకు చెందిన వ్యక్తి అదృశ్యంపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు. పామూరు చెన్నకేశవనగర్ 1వ లైన్‌కు చెందిన యాదగిరి నాగ ప్రవీణ్ గత నెల 23వ తేదీ రాత్రి బాడుగ నిమిత్తం మండలంలోని వగ్గంపల్లెలోని వ్యక్తికి చెందిన పశువులను మార్కాపురం తీసుకుపోయేందుకు వెళ్లాడు. అక్కడ పశువులను దించి తిరిగివస్తూ వగ్గంపల్లెలో 24వ తేదీ తెల్లవారుజాము 3.30 గంటల సమయంలో పశువుల యజమానులను వగ్గపల్లెలో దించివేశాడు. అప్పటి నుంచి నాగప్రవీణ్ తన వాహనంతో తిరిగి రాకపోవడంతో తండ్రి నాగేశ్వరరావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నష్టపరిహారం చెక్కుల పంపిణీ


చెక్కు అందిస్తున్న రేంజి అధికారి జీవన్‌కుమార్

పెద్దదోర్నాల: నల్లమల అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లి పెద్దపులుల దాడుల్లో చనిపోయిన పశువుల యజమానులకు అటవీ శాఖాధికారులు మంగళవారం నష్ట పరిహారం చెక్కులు అందజేశారు. స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చింతల, బోడేనాయక్ తండాలకు చెందిన పలువురు గిరిజన పశుపోషకులకు రేంజి అధికారి జీవన్‌కుమార్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కుడుముల పోతయ్యకు రూ.20 వేలు, కుడుముల పెద్దక్కకు రూ.15 వేలు, కుడుమలు హనుమక్కకు రూ.15 వేలు, భూమని హనుమక్కకు రూ.20 వేలు, కుడుముల బయ్యన్నకు రూ.15 వేలు, బోడేనాయక్ తండాకు చెందిన దుమావత్ శ్రీనునాయక్ రూ.20 వేలు చొప్పున చెక్కులు అందజేశారు. చింతల బీట్ ఆఫీసర్ చెన్నయ్య, పశు పోషకులు పాల్గొన్నారు.

కూలి అందక.. పూట గడవక..!

- ఉపాధి కూలీలకు రెండున్నర నెలలుగా అందని వేతనం
- చేసిన పనికి ప్రతిఫలం అందక కూలీల ఆవేదన
- ఉపాధిపై నమ్మకం లేక ఇతర పనులకు మొగ్గు
- పని ప్రదేశంలో లేని మెడికల్ కిట్లు


ఫాంపాండ్ పనులు చేస్తున్న కూలీలు

బేస్తవారిపేట: వలసలు నివారించేందుకు, గ్రామీణ ప్రాంతాల్లోనే ఉపాధి కల్పించేందుకు 2006లో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో పనిచేసిన కూలీలకు వారం రోజుల్లో వేతనాలు అందించాల్సి ఉంది. ప్రతి కూలీకి రోజువారీ వేతనం రూ.300 నిర్దేశించగా, కూలీలు చేసిన పనికి రూ.275 ప్రకారం అందిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు అందించడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు. గతంలో నెలల తరబడి వేతనాలు అందని పరిస్థితి ఎప్పుడూ లేదని కూలీలు వాపోతున్నారు.

సౌకర్యాలు అంతంతమాత్రమే..

ఉపాధి కూలీలకు నిలువ నీడ లేదు. మండుటెండలో విలవిల్లాడుతున్నారు. వేసవిలో భానుడు ఉగ్ర రూపం దాల్చడంతో ఇబ్బందులు పడుతున్నారు. పనుల సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి కనీసం నీడ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనిచేసే సమయంలో వడదెబ్బ, చిన్నచిన్న గాయాలవుతుంటాయి. ఈ సమయంలో ప్రాథమిక చికిత్స చేయడానికి మెడికల్ కిట్లు పని ప్రదేశంలో ఉంచాలి. వాటిని కూడా ప్రభుత్వం ఇంత వరకు సరఫరా చేయలేదు. వేతనదారులు డీహైడ్రేషన్‌కు గురైతే కనీసం ఓఆర్‌ఎస్ ప్యాకెట్ కూడా లేని పరిస్థితి క్షేత్రస్థాయిలో నెలకొంది. గతంలో వేసవిలో కూలీలకు మజ్జిగ పంపిణీ చేయడంతో పాటు, ఎండల్లో పనిచేసే వారికి టార్పాలిన్ పట్టలు పంపిణీ చేశారు. కానీ ఇటీవల కూలీలకు అందే సౌకర్యాలు తగ్గించడంతో పని ప్రాంతాల్లో ఇబ్బందులు తప్పడం లేదు.

ఇతర పనులకు మొగ్గు..

జిల్లాలోని 38 మండలాల్లో గుర్తించిన 840 పనుల్లో 59,011 మంది కూలీలకు పని కల్పించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం వారిలో సగం 36,260 మంది మాత్రమే పనులకు హాజరవుతున్నారు. రెండు, మూడు నెలల కూలి డబ్బులు అందక కుటుంబ పోషణ భారంగా మారి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కూలీలు క్రమంగా ఉపాధి పనులకు స్వస్తి పలుకుతూ ప్రత్యామ్నాయ పనులు వెతుక్కునే పనిలో పడ్డారు.

తక్కువ కూలీలు హాజరవుతున్న మండలాలు..

మండలం	హాజరు కావాల్సిన కూలీలు	హాజరవుతున్న కూలీలు
సింగరాయకొండ	2216	987
తర్లుపాడు	1721	672
యర్రగొండపాలెం	2366	975
కురిచేడు	739	347
గిద్దలూరు	1294	762
దర్శి	1531	689
కొత్తపట్నం	1416	730
పొదిలి	2237	1288
రాచర్ల	1899	809


క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

క్రీడలతో ఐకమత్యం పెంపు

- రెండు జిల్లాల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

సీఎస్‌పురం(పామూరు): క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి, సర్పంచ్ షేక్.ఖాదర్‌బీబుజ్జి, డాక్టర్ పి.వీ రన్నగౌడ్ అన్నారు. మండలంలోని శీలంవారిపల్లె గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా ప్రకాశం, నెల్లూరు జిల్లాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను వారు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సైతం తమ పిల్లలను ఆ దిశగానే ప్రోత్సహించాలన్నారు. క్రీడలు అంతర్గత శక్తి సామర్థ్యాలను, దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, పోటీల్లో పాల్గొనే వారు క్రీడాస్ఫూర్తితో టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలన్నారు. టోర్నమెంట్‌లో 25 జట్లు తమ పేర్లను నమోదుచేసుకున్నారు. ఉపసర్పంచ్ తీకెనం బాబూరావు, ముడియాల గోపి, మాజీ ఎంపీటీసీ మునగల నారాయణరెడ్డి, సంగిశెట్టి పీరయ్యనాయుడు, కొట్టే రవీంద్ర, శ్రీనివాసులు, కదిరి రత్నం, సన్నపురెడ్డి రామకృష్ణ, షేక్.ఖాజావలి, పలువురు పాల్గొన్నారు.

ఒకే రాత్రి ఐదు ఆలయాల్లో దొంగతనం


చోరీ జరిగిన లంకోజనపల్లి ఆంజనేయ స్వామి ఆలయం


రోడ్డుపై హుండీలు

దర్శి: మండలంలో ఒకే రాత్రి ఐదు ఆలయాల్లో చోరీలు జరిగాయి. ఈ సంఘటనలు మండలంలోని లంకోజనపల్లి, వెంకటాపురం గ్రామాల్లో మంగళవారం రాత్రి జరిగాయి. లంకోజనపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ పగులగొట్టి సుమారు రూ.25 వేల నగదు తీసుకెళ్లారు. తూర్పు వెంకటాపురంలో పోలేరమ్మ, అంకాలమ్మ, శివాలయం, బాలాపుర పోలేరమ్మ ఆలయాల్లో తాళాలు పగులగొట్టి హుండీల్లో ఉన్న సుమారు రూ.20 వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లారు. పోలేరమ్మ ఆలయంలో వెండి హారం, కిరీటం ఉండగా కిరీటాన్ని వదిలేసి వెండి హారం, హుండీని ఎత్తుకెళ్లారు. మిగిలిన మూడు ఆలయాల్లో హుండీలు ఎత్తుకెళ్లి పగులగొట్టి నగదు దోచుకున్నారు. ఒకే రోజు వరుస దొంగతనాలు జరగడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ముండ్లమూరు మండలంలో కూడా ఇదే విధంగా ఒకే రాత్రి మూడు దొంగతనాలు జరిగాయి.

పింఛన్ నగదు మాయం


పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు


పింఛన్ కోసం ఆందోళన చేస్తున్న మహిళలు

- పోలీసుల దర్యాప్తు

తర్లుపాడు: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇచ్చేందుకు రెండు రోజుల క్రితం బ్యాంకు నుంచి డ్రా చేసిన పింఛన్ సొమ్ము అదేరోజు మాయమైంది. ఈ ఘటనపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని కేతగుడిపి సచివాలయ పరిధిలో పంపిణీ చేయాల్సిన పింఛన్ రూ.15.36 లక్షల నగదును సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంటు మల్లిక గత నెల 29న బ్యాంకు నుంచి డ్రా చేసి నగదును బ్యాగులో పెట్టుకుని ఆటో ఎక్కుతుండగా క్యాష్ ఉన్న బ్యాగును ఆటోలో పెట్టగానే ఆటో డ్రైవరు ఉడాయించాడని మంగళవారం మార్కాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రెండు రోజుల తరువాత ఫిర్యాదు చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. మంగళవారం గ్రామానికి చెందిన వృద్ధులు పింఛన్ కోసం ఎదురుచూస్తుండగా సచివాలయ ఉద్యోగి వచ్చి పింఛన్ డబ్బులు కనిపించడం లేదని చెప్పడంతో ఒక్కసారిగా అందరూ నివ్వెరపోయారు. అప్పుడు సదరు ఉద్యోగిని మార్కాపురం పట్టణ పోలీసుస్టేషన్‌కు వెళ్లి నగదు మాయంపై ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు. ఈ విషయమై ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు. మరోవైపు అదే గ్రామానికి చెంది మరో ఉద్యోగి 31 మంది లబ్ధిదారులకు పింఛను అందించగా మిగిలిన వారు తమకు రాకపోవడంతో సచివాలయం వద్ద పింఛను డబ్బుల కోసం ఎదురుచూసున్నారు.

సముద్రంలో గల్లంతై యువకుడు మృతి

- మరో యువకుడిని కాపాడిన మెరైన్ పోలీస్‌లు


వంశీ మృతదేహం

వేటపాలెం: సముద్రం నీటిలో మునిగి యువకుడు మృతి చెందాడు. మరో యువకుడిని మెరైన్ పోలీసులు కాపాడారు. ఈ సంఘటన మండలంలోని రామాపురం సముద్రతీరంలో మంగళవారం జరిగింది. మెరైన్ పోలీస్‌లు తెలిపిన వివరాల మేరకు.. పర్చూరు నెహ్రూ కాలనీకి చెందిన చుక్కా వంశీ (26) చిలకలూరిపేట దగ్గరలోని పసుమర్రు గ్రామానికి చెందిన షేక్ రహమతుల్లా ఇద్దరు రామాపురం సముద్రతీరానికి వచ్చారు. పర్యాటకులతో కలిసి ఇద్దరు సముద్రంలో స్నానాలు చేసే సమయంలో అలల తీవ్రతకు ఇద్దరూ కొట్టుకుపోతూ కేకలు వేశారు. అక్కడే ఉన్న మెరైన్ పోలీస్‌లు, స్థానిక జాలర్ల వెంటనే స్పందించి ఇద్దరిని నీటిలో నుంచి బయటికి తీసుకువచ్చారు. అయితే వంశీ సముద్రం నీరు బాగా తాగడంతో పరిస్థితి విషమించింది. అక్కడే సీపీఆర్ చేసి 108లో చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో యువకుడు షేక్ రహంతుల్లా వెంటనే కోలుకున్నాడు. ఎస్సై వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశు వైద్యశాలల్లోనూ నీటి తొట్లు

- పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి


రికార్డులు పరిశీలిస్తున్న జేడీ బేబీరాణి

కొనకనమిట్ల: జిల్లాలో అన్ని పశు వైద్యశాలల్లో నీటి తొట్లు ఏర్పాటు చేసి పశు పోషకులకు ఇబ్బంది కలగకుండా కృషి చేస్తున్నామని పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కొనకనమిట్ల పశు వైద్యశాలను ఆమె పరిశీలించారు. జేడీ మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. పశువులకు సంక్రమించే సీజనల్ వ్యాధులు, నివారణ మార్గాలపై పశుపోషకులకు అవగాహన కల్పించారు. వేసవి దృష్ట్యా పశు వైద్యశాలల్లోనూ నీటి తొట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం స్థానిక పశు వైద్యశాల ఆవరణలో రైతులకు గడ్డి జొన్నలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి అమూల్య, వెటర్నరీ అసిస్టెంట్ పూర్ణచంద్రరావు, ఆఫీస్ సబార్డినేట్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

5 కేజీల గంజాయి స్వాధీనం

- నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం

టంగుటూరు: వైజాగ్ నుంచి తీసుకువచ్చి హాస్టల్‌లో నిల్వ ఉంచిన 5 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన రెండు రోజుల క్రితం జరగ్గా..ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..వల్లూరు సమీపంలోని ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి వైజాగ్ నుంచి 5 కేజీల గంజాయి తీసుకువచ్చి వల్లూరులోని ఓ హోటల్ వెనుక ఉన్న హాస్టల్‌లో నిల్వ ఉంచాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మొత్తం నలుగురు యువకులను పోలీసులు అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

వృథాగా సాగర్ జలాలు


వృథాగా పోతున్న సాగర్ జలాలు

దొనకొండ: చందవరం సమ్మర్ స్టోరేజీ నుంచి 13 గ్రామాలకు సాగర్ జలాలు సరఫరా అయ్యే మెయిన్ పైపు బాదాపురం కొండ వద్ద లీకై నీరు వృథాగా పోతోంది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో 5 సార్లు పశు పోషకులు నీటి కోసం పైప్ పగలగొట్టారు. బాదాపురం, దొనకొండ, పెద్దగుడిపాడు, చిన్నగుడిపాడు, యర్రబాలెం, గంగదేవిపల్లి, పెదన్నపాలెం, దొండపాడు, ఆరవల్లిపాడు గ్రామాలకు నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎన్నోసార్లు పైపులైన్‌కు మరమ్మతులు చేసి నీరు సరఫరా చేస్తున్నారు. వేసవి కావడంతో పశు పోషకులు మళ్లీ పైపులైన్ పగలకొట్టి నీరు వృథా చేస్తున్నారు. వేసవి కావటంతో గ్రామాల్లోని ప్రజలకు ఇబ్బంది లేకుండా మెయిన్ పైపులైన్‌కు వేసవి కాలం గడిచే వరకు కాపలాదారుడిని ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

అంతంత మాత్రంగా ఆస్తి పన్ను చెల్లింపులు

- ప్రస్తుతం ప్రభుత్వం 50 శాతం వడ్డీ మాఫీ ప్రకటన
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 100 శాతం వడ్డీ మాఫీ
- జిల్లాలో డిమాండ్ రూ.107.83 కోట్లు
- చెల్లించింది మాత్రం రూ.59.48 కోట్లు
- ఇంకా బకాయిలు రూ.48.36 కోట్లు


మార్కాపురం పట్టణ వ్యూ


మున్సిపల్ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్

మార్కాపురం టౌన్:

గత ఆర్థిక సంవత్సరం 2023–24లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలపై భారం పడకుండా ఉండేందుకు ఆస్తి పన్ను బకాయిదారులకు 100 శాతం వడ్డీ మాఫీ ప్రకటించింది. దీంతో ప్రజలు సంతోషంగా ఆస్తి పన్ను చెల్లించారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం సుమారు వారం రోజుల క్రితం వడ్డీలో 50 శాతం మాఫీ ప్రకటించడంతో వసూళ్లు మాత్రం ఆశించిన మేర మున్సిపల్ ఖజానాకు చేరలేదు. ఉన్న ఆస్తి పన్ను డిమాండ్‌కు పన్నుదారులు సగం మాత్రమే బకాయిలు చెల్లించారు. పురపాలక సంఘాల్లో ఆస్తి పన్ను, ఖాళీ స్థలం, నీటి పన్నులు చెల్లించాలని ప్రజలకు సూచించారు. జిల్లాలో ఒక కార్పొరేషన్‌తో పాటు ఆరు మున్సిపాల్టీలు/నగర పంచాయితీలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం 2024–25 మార్చి 31వ తేదీ నాటికి ఆస్తి పన్నులు ప్రజలు సుమారు 50 శాతం మేర మాత్రమే చెల్లించారు. మార్చి నెలాఖరు నాటికి పన్నుల రూపంలో 95 శాతం ప్రజలు చెల్లించే అవకాశం ఉటుందని అధికారులు భావించినా లక్ష్యం నెరవేరలేదు.

బకాయిలు వసూళ్లలో సిబ్బంది అలసత్వం

పురపాలక సంఘాల్లో పన్నుల వసూళ్లకు గతంలో బిల్ కలెక్టర్‌లు ఇంటింటికీ తిరిగి డిమాండ్ నోటీసులు ఇచ్చి పన్నులు చెల్లించాలని పన్నుదారులు కోరే వారు. వారి స్థానంలో సచివాలయం సిబ్బంది, కాంట్రాక్టు ఉద్యోగులకు అప్పగించారు. ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల కావడంతో కొంతమంది ఉద్యోగులు జిల్లా వ్యాప్తంగా మున్సిపాల్టీల్లో సెలవు పెట్టి ప్రిపరేషన్‌కు వెళ్లారు. సిబ్బంది కొరతతో ఇస్తి పన్ను బకాయిల వసూళ్లలో ప్రజలకు ముందస్తు సరైనా అవగాహన కల్పించలేకపోయారు. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి మున్సిపాల్టీకి చెల్లించాల్సిన పన్ను బకాయిలు చెల్లించాలని మైక్‌ల ద్వారా ప్రచారం చేశారు. పన్నుల చెల్లింపులో వడ్డీపై 50 శాతం తగ్గింపు ప్రభావం కూడా బాగా చూపిందని కొందరు అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని పురపాలక సంఘాల్లో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసిన ఆశించిన మేర పన్నుల బకాయిలను రాబట్టలేకపోయారు.

జిల్లాలో పన్నుల విధింపు

జిల్లాలో ఒంగోలు కార్పొరేషన్‌తో పాటు మార్కాపురం మున్సిపాలిటీ, ఐదు నగర పంచాయతీలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం 2024–25, మార్చి 31వ తేదీ నాటికి పన్నులు ఇలా ఉన్నాయి. జిల్లాలో మొత్తం 1,35,222 అసెస్‌మెంట్లు ఉండగా అందులో మొత్తం డిమాండ్ రూ.107.83 కోట్లు ఉండగా అందులో ఇప్పటికి 59.48 కోట్ల రూపాయల ఆస్తి పన్నులు ప్రజలు చెల్లించారు. ఇంకా బకాయిల రూపంలో రూ.48.36 కోట్లను పురపాలక సంఘాలకు చెల్లించాల్సి ఉంది. అందులో భాగంగా ఒంగోలు కార్పొరేషన్‌లో 66,069 అసెస్‌మెంట్లకు రూ.73.39 కోట్ల డిమాండ్ ఉండగా రూ.37.66 కోట్లు, మార్కాపురం 18,345 అసెస్‌మెంట్లకు రూ.11.20 కోట్లకు రూ.6.62 కోట్లు, కనిగిరి 9,991 అసెస్‌మెంట్లకు రూ.4.93 కోట్లకు రూ.3.31 కోట్లు, గిద్దలూరు 12,497 అసెస్‌మెంట్లకు రూ.4.67 కోట్లకు రూ.3.42 కోట్లు, దర్శి 9,720 అసెస్‌మెంట్లకు రూ.5.28 కోట్లకు రూ.3.61 కోట్లు, చీమకుర్తి 7,315 అసెస్‌మెంట్లకు రూ.4.73 కోట్లకు రూ.3.16 కోట్లు, పొదిలి 11,285 అసెస్‌మెంట్లకు రూ.3.63 కోట్లకు రూ.1.70 కోట్ల మేర పన్నులు ప్రజలు చెల్లించారు.

పన్ను వసూళ్ల శాతంతో మున్సిపాల్టీలు ఇలా

జిల్లాలోని వివిధ పురపాలక సంఘాల్లో పన్నుల చెల్లింపులో శాతంగా ఇలా ఉన్నాయి. పొదిలి నగర పంచాయతీ పన్నుల వసూళ్లలో 46.94 శాతంతో వెనుకబడి ఉంది. గిద్దలూరు నగర పంచాయతీ 73.37 శాతంతో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. మిగిలిన పురపాలక సంఘాలు దర్శి 68.28 శాతం, కనిగిరి 67.09, చీమకుర్తి 66.83, మార్కాపురం 59.13, ఒంగోలు కార్పొరేషన్ 51.31 శాతంలో ఉన్నాయి.